# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్ట్ మైనింగ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **రాష్ట్రంలో రెండో విడత భూముల రీసర్వే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని చెప్పిన రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్.**

3. **బీసీ విద్యార్థులకు నీట్, ఐఐటీ శిక్షణ కోసం రెండు ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత**

4. **75 కోట్ల రూపాయల ఖేలో ఇండియా నిధులతో రాష్ట్రంలో స్టేడియంలను అభివృద్ధి చేసామని తెలిపిన రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి.**

=========================

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్నారు. తుగ్గలి మండలం జొన్నగిరిలో ఏర్పాటు చేసిన గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కు కూడా శంకుస్థాపన చేస్తారు. 405 కోట్ల రూపాయల పెట్టుబడితో రెండు ప్రైవేటు సంస్థలు గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశాయి. జొన్నగిరి కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం పత్తికొండ నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు.

-------------------------

రాష్ట్రంలో రెండో విడత భూముల రీసర్వే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. తిరుపతిలో నిర్మించిన నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. శ్రీనివాసపురంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును కూడా మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మట్లాడుతూ.... వివాదంలో ఉన్న భూములను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందని.. ప్రజల దగ్గరకే సుపరిపాలన వెళ్లాలనేది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్య ప్రసాద్ తెలియజేస్తూ...

వాయిస్..30 సెకన్లు

-------------------------

విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్నారు. మోపిదేవి మండలం కొక్కిలి గడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక కోటి 40 లక్షల రూపాయల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన మోపిదేవిలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పులిగడ్డలో మత్స్యకారులతో మంత్రి నారాలోకేశ్ సమావేశం కానున్నారు.

---------------------------

ఉమ్మడి కృష్ణా జిల్లాలో త్రాగునీరు అందించడానికి జలజీవన్ మిషన్ 2 ద్వారా ఆరువేల కోట్ల నిధులను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసిందని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాల శౌరి తెలిపారు. మచిలీపట్నంలోని తన కార్యాలయంలో ఈ రోజు ఆయన జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మచిలీపట్నం నియోజకవర్గంలో మంజూరైన 6 లక్షల 40 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

---------------------------

బీసీ సంక్షేమ శాఖలో గడిచిన రెండేళ్లలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో ఈ రోజు ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత మొదటి బడ్జెట్‌లో బీసీలకు 39 వేల కోట్ల రూపాయలు, రెండో బడ్జెట్‌లో 47 వేల కోట్ల రూపాయలు, మూడో బడ్జెట్ 51 వేల కోట్ల రూపాయలు కేటాయించామని వివరించారు. రాష్ట్రంలో కొత్తగా మరో 10 మహాత్మా జ్యోతి రావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలు ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బీసీ విద్యార్దుల నీట్, ఐఐటీ శిక్షణ కోసం రెండు ఎక్స్ లెన్సీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సవిత వివరిస్తూ ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

ఖేలో ఇండియా ద్వారా వచ్చిన 75 కోట్ల రూపాయల నిధులతో రాష్ట్రంలో స్టేడియంలను అభివృద్ధి చేసామని రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి చెప్పారు. అమరావతి సచివాలయంలో ఈరోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడా శాఖను అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లామని చెప్పారు. గడిచిన రెండేళ్లలో క్రీడలను ప్రోత్సాహించడంతో పాటు క్రీడాకారులను అన్ని విధాలా ఆదుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సాహించేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని పేర్కొన్నారు. ప్రతిభా వంతులైన క్రీడాకారులకు ఉద్యోగ రిజర్వేషన్ ను 2 నుంచి 3 శాతం వరకూ పెంచామని రాంప్రసాద్ రెడ్డి తెలియజేస్తూ...

వాయిస్..30.. బైట్

---------------------------

దేశ సమగ్రత కోసం, అఖండ భారత నిర్మాణమే లక్ష్యంగా తన ప్రాణాలను బలిదానం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. డాక్టర్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిన్న ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ .. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు అనే నినాదంతో జమ్మూ కాశ్మీర్‌ను పూర్తిస్థాయి విలీనం కోసం ముఖర్జీ చేసిన పోరాటం చారిత్రికమైనదన్నారు.

---------------------------

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ తన వివరాలను అందజేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లి లోని తమ నివాసానికి వచ్చిన బూత్ స్థాయి అధికారి అడిగిన సమాచారం, పత్రాలను మంత్రి లోకేష్ నిన్న సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఒక్కరూ ఈ ప్రక్రియలో పాల్గొనాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనే ప్రజలు ఏమైనా సందేహాలు ఉంటే ఆయా వార్డుల్లో నియమితులైన బీఎల్ఓలను సంప్రదించాలన్నారు.

---------------------------

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్ లో రాజకీయ నాయకుల జోక్యం ఉంటె సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. ఏలూరు కలెక్టర కార్యాలయం నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రగతిపై ఆమె నిన్న సంబంధిత అధికారులు సిబ్బందితో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేపటిక్లలా జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారముల పంపిణీ,మాపింగ్ పనులు పూర్తి చేయాలనీ, డిజిటలైజేషన్ కనీసం 20 శాతం పూర్తి చేయాలని చెప్పారు.

---------------------------

2027వ సంవత్సరం హజ్ యాత్రకు సంబంధించి యాత్రికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దరఖాస్తు దారులు తమ దరఖాస్తులను జూలై 20 వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. జూలై చివరి వారంలో నిర్వహించే లాటరీ విధానం ద్వారా యాత్రికులను ఎంపిక చేస్తామని తెలిపారు.

---------------------------

ఈనెల 28 న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని గుంటూరు జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కె. విజయ లక్ష్మి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆమె ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ పోలియో నిర్మూలనకు సమష్టి కృషి అవసరం అని, కార్యక్రమం విజయవంతం కావడంలో అన్ని శాఖల సమన్వయం కీలకమని అన్నారు.

=====================